

జాతీయ వార్తను ఈ-పేపర్‌లోను

డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో

వీక్షించండి

epaper:jatheeyavaartha.com

www.jatheeyavaartha.com



# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి వాటిని జాతీయ వార్త తెలుగు దినపత్రికలో ప్రచురిస్తాం.. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.

ఎడిటర్: చౌదరి, 9963063761



గురువారం | 08-10-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 803 పేజీలు: 4 వెల : రూ.7


## ఓవర్‌లోడ్ వాహనాలపై..

# విజిలెన్స్ కన్ను



✳ నవభారత్ జంక్షన్ వద్ద లారీలపై మెరుపు దాడులు ✳ నిబంధనలు పాటించని లారీ యజమానులకు రూ.1.20 లక్షల జరిమానా ✳ 60 టన్నుల ఇసుక లోడులు చూసి అధికారులు షాక్ ✳ మోతాదుకు మించి తోడేస్తున్న ఇసుక మాఫియా

శ్రీకాకుళం, అక్టోబర్ 7 (వార్త): రవాణా శాఖ నిద్రమత్తు వదులుకోకపోయినా, ఓవర్ లోడింగ్ మాఫియాపై విజిలెన్స్ విభాగం విరుచుకుపడింది. కలెక్టర్ ఆదేశాలు, నిరంతరం ధ్వంసమవుతున్న రహదారులపై 'జాతీయ వార్త' కథనాలతో స్పందించిన రవాణా శాఖ విజిలెన్స్ అధికారులు బుధవారం జిల్లాలో మెరుపు దాడులు నిర్వహించారు. నవభారత జంక్షన్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో నిబంధనలు తీవ్రంగా అతిక్రమించి నడుస్తున్న రెండు భారీ లారీలను సీజ్ చేసి, రూ.1.20 లక్షల జరిమానా విధించారు. సాధారణంగా లారీ రకాన్ని బట్టి 20 నుంచి 36 టన్నుల వరకే రవాణాకు అనుమతి ఉంటుంది. కానీ, విజిలెన్స్ దాడుల్లో పట్టుబడిన రెండు లారీలు ఏకంగా 60 టన్నుల బరువుతో రోడ్డెక్కడం చూసి అధికారులు సైతం విస్తుపోయారు. అనుమతించిన దానికి రెట్టింపు భారాన్ని మోస్తూ, రహదారులను గుల్ల చేస్తున్న ఈ వాహనదారులకు ఒక్కో లారీకి రూ.60 వేల చొప్పున జరిమానా వేశారు. రవాణా నిబంధనల ప్రకారం 10 టైర్ల లారీకి 20 టన్నులు, 12 టైర్లకు 26 టన్నులు, 14 టైర్లకు 31 టన్నులు, 16 టైర్ల లారీకి 36 టన్నుల వరకు మాత్రమే పరిమితి ఉంది. అయితే, శ్రీకాకుళం జిల్లాలోని నాగావళి, వంశధార నదీ పరీవాహక ప్రాంతాల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మాఫియా, ఏకంగా 10 నుంచి 15 టన్నులకు పైగా అదనపు లోడుతో వాహనాలను నడుపుతోంది. ఇటీవల జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో కలెక్టర్ రోడ్ల విధ్వంసంపై రవాణా అధికారుల అలసత్వాన్ని తీవ్రంగా ప్రశ్నించిన సంగతి తెలిసిందే. 'కొత్త రోడ్డు జంక్షన్'తో పాటు ఆమదాలవలస నియోజకవర్గ పరిధిలోని రహదారులన్నీ ఈ ఓవర్ లోడ్ దెబ్బకే ఛిద్రమయ్యాయని స్వయంగా ప్రస్తావించినా, స్థానిక రవాణా శాఖ స్పందించకపోవడంతో విజిలెన్స్ రంగంలోకి దిగాల్సి వచ్చింది.

### రాత్రి తవ్వకాలు.. రవాణా అడ్డగోలు!

అర్ధరాత్రి వేళల్లో నదీ గర్భాలను జేసీబీలతో తోడేస్తూ, నిబంధనలకు విరుద్ధంగా లారీలు, టిప్పర్లలో ఇసుకను సరిహద్దులు దాటిస్తున్నారు. రోజుకు 120కి పైగా ట్రాక్టర్లు, లారీలతో అక్రమంగా తరలిస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. విజిలెన్స్ విభాగం బుధవారం చేపట్టిన ఈ దాడులతో ఓవర్ లోడింగ్ మాఫియా గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఇసుక తరలింపుదారులు మాత్రం విజిలెన్స్ అధికారులు ఎక్కడెక్కడ తనిఖీలు చేస్తున్నారన్నది ముందస్తుగా తెలుసుకునే పనిలో పడ్డారు. వాహనాలు తనిఖీ చేస్తున్నారని సమాచారం అందుకున్న వెంటనే వాహనాలను రోడ్ల పక్కనే నిలిపివేస్తున్నారు. విజిలెన్స్ అధికారులు వెళ్లిపోయారని తెలుసుకున్న తర్వాతే వాహనాలను తరలిస్తున్నారు.



## దర్జాగా వచ్చారు.. దోచుకెళ్లారు..!

☀ కొత్త అవతారమెత్తిన దొంగలు ☀ బాలాజీపురంలోని పశువుల శాల నుంచి 38 మేకలు, గొర్రెలు అపహరణ

☀ లబోదిబోమంటున్న బాధితుడు బాలరాజు



మందస, అక్టోబర్7(వార్త): దొంగలు కొత్త అవతారం ఎత్తారు.. బంగారం, డబ్బు, విలువైన వస్తువులను కాకుండా మేకలు, గొర్రెలను అపహరిస్తున్నారు. అది కూడా దర్జాగా పని కానించేస్తున్నారు. ఏ మాత్రం భయంలేకుండా సుమారు రూ.4.50లక్షలు విలువ చేసే మేకలు, గొర్రెలు దొంగిలించుకుపోయారు. వాస్తవానికి మేకలు, గొర్రెలు మందలో ఎవరైనా, ఏదైనా జంతువు ప్రవేశిస్తే అరుస్తాయి. కానీ, దొంగలు పక్కా ప్రణాళికతో రెక్కీ చేసి, మరీ దొంగతనానికి పాల్పడినట్టు స్పష్టమవుతోంది. వివరాలిలా ఉన్నాయి. మందస మండలంలోని సొండిపూడి పంచాయతీలో గల బాలాజీపురం గ్రామంలో యాదవ కులానికి చెందిన తలగాన బాలరాజు సుమారు 80 మేకలు, గొర్రెలను పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నారు. బాలాజీపురం కాలనీలో ఉంటున్న ఆయన పక్కనే పశువుల శాల ఉంది. ప్రతీ రోజూ మేకలు, గొర్రెలను మేపించి, రాత్రి సమయంలో పశువులశాలలో వీటిని ఉంచుతుంటాడు. బాలరాజు ఇంటికి మూడిళ్ల దూరంలోనే పశువుల శాల ఉండడంతో రాత్రి వేళలో కూడా ఆయన పలుమార్లు పశువులశాల వద్దకు వెళ్లడం, మేకలు, గొర్రెలను చూసుకుని వెళ్లడం చేస్తుండేవాడు. గ్రామస్తులు చెప్పిన ప్రకారం మంగళవారం అర్ధరాత్రి దాటాక ఈ దొంగతనం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. దొంగతనంపై ముందుగా ప్లాన్ వేసుకున్న దొంగలు వాహనం తీసుకువచ్చి ఉంటారని భావిస్తున్నారు. ఎంతో నేర్పరితో మేకలు, గొర్రెలు అరవకుండా చేసి, సుమారు 38 మేకలు, గొర్రెలు, మేకపోతులు, గొర్రెపోతులు, మేక, గొర్రె పిల్లలను వాహనంలో ఎక్కించుకుని తరలించుకుపోయినట్టు అనుమానిస్తున్నారు. బుధవారం వేకువజామున పశువుల శాల వద్దకు వచ్చిన బాలరాజు మేకలు, గొర్రెలు అపహరణకు గురయినట్టు నిర్ధారించుకుని, కన్నీటి పర్యవంతమయ్యాడు. మందస పోలీసులకు ఫిర్యాదు చేశారు. మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. దర్యాప్తు ప్రారంభించారు. బాలాజీపురం రహదారి మీదుగా నిత్యం ఒడిశా, ఆంధ్రా వాహనాలు తిరుగుతుంటాయి. చెరువు కూడా ఉండడంతో స్థానికులు బహిర్భూమికి వెళ్లుంటారు. దాదాపు నిత్యం ప్రజలు తిరుగాడే ప్రదేశంలోనే ఈ దొంగతనం జరగడం విశేషం. కాగా, దొంగలు ఏ వాహనంలో వచ్చారు.. ఎటు వైపు ప్రయాణించారు.. తదితర అంశాలను పోలీసులు నిశితంగా పరిశీలిస్తున్నారు. అంతేకాకుండా సీసీ కెమేరాల ఫుటేజీని కూడా తనిఖీ చేస్తున్నారు. ఆయా ఫుటేజీలో అనుమానిత వాహనాల ఆరా తీస్తున్నారు. మేకలు, గొర్రెలపై ఆధారపడి బతుకుతున్న బాలరాజు సుమారు రూ.4.50లక్షల విలువైన జీవాలు దొంగతనానికి గురవ్వడంతో తాను ఎంతో నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

# స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

✳ జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ✳ పలు శాఖల అధికారులతో సమీక్ష

శ్రీకాకుళం, అక్టోబర్7 (వార్త): త్వరలో జరగనున్న మండల ప్రజా పరిషత్‌లు, జిల్లా ప్రజా పరిషత్‌లు, పురపాలక సంఘాల ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లతో కలిసి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, పోలీస్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల నిబంధనల సంకలనం ప్రకారం ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. తొలిదశలో పురపాలక సంఘాల వార్డు కౌన్సిలర్లు, చైర్మన్ ఎన్నికలతో పాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సిద్ధం కావాలన్నారు. బ్యాలెట్ బాక్సుల భద్రతకు పటిష్టమైన డబుల్ లాక్ విధానంతో కూడిన స్ట్రాంగ్ రూమ్‌లను గుర్తించడంతో పాటు, కౌంటింగ్ హాళ్లలో మౌలిక వసతులు కల్పించాలని స్పష్టం చేశారు. గురువారం రాష్ట్ర ఎన్నికల అధికారి నిర్వహించనున్న సమావేశానికి పూర్తి సమాచారంతో



అధికారులు హాజరుకావాలన్నారు. బ్యాలెట్ పేపర్లు, వాటి ముద్రణకు తగిన ప్రణాళికతో ఉండాలని చెప్పారు. ప్రీ పోలింగ్ మేనేజ్మెంట్ గురించి పూర్తి అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. ఎంపీడీఓలు, పోలీస్ అధికారులు సంయుక్తంగా గ్రామ పంచాయతీల్లోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేయాలన్నారు. కేంద్రాల వద్ద కాంపౌండ్ వాల్, విద్యుత్, ఇంటర్నెట్ వసతులు పక్కాగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఏవైనా సమస్యలుంటే ముందే తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ఓటర్ల సంఖ్య ప్రాతిపదికన పోలింగ్, కౌంటింగ్ సిబ్బందిని ఎంపిక చేసి, మాస్టర్ ట్రైనర్ల ద్వారా తగిన శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు సమగ్ర భద్రతా ప్రణాళిక రూపొందించామని ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి వెల్లడించారు. జిల్లాలోని సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలను ముందే గుర్తించి అదనపు బలగాలతో భద్రతను కట్టుదిట్టం చేస్తామన్నారు. నోటిఫికేషన్ వెలువడక ముందే బైండోవర్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి నిబంధనలను కఠినంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ హరి ఓం పాండియా, డీఆర్వో విశ్వేశ్వరరావు, జెడ్పీ సీఈవో ఆర్.వెంకట్రామన్, జిల్లా పంచాయతీ అధికారి స్వరూప రాణి, డీఎస్పీలు, ఆర్డీఓలు, ఆయా మండలాల నుంచి తహసిల్దారులు, ఎంపీడీవోలు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# కార్యకర్తలే పార్టీకి బలం.. వారి కష్టాన్ని గుర్తించడం బాధ్యత

**- యువనేత నారా లోకేష్ స్ఫూర్తితో ఆత్మీయ గౌరవ సత్కారం**

**- కూటమి విజయానికి కృషి చేసిన కార్యకర్తలకు ప్రత్యేక గౌరవం**

**- పలాస నియోజకవర్గంలో ఎమ్మెల్యే గౌతు శిరీష ఆధ్వర్యంలో వేడుక**



**పలాస, అక్టోబరు 7 (వార్త):** కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని, వారి కష్టాన్ని గుర్తించి గౌరవించడం ప్రతి నాయకుడి బాధ్యత అని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. యువనేత నారా లోకేష్ ఇచ్చిన స్ఫూర్తితో కార్యకర్తలే అధినేతలనే భావనతో వారికి ఆత్మీయ గౌరవం అందించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటులోనూ, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు చేసిన కృషి అభినందనీయమని ఆమె తెలిపారు. కార్యకర్తల కష్టం, అంకితభావం, పార్టీ పట్ల ఉన్న నిబద్ధతను గుర్తిస్తూ పలాస నియోజకవర్గంలో ప్రత్యేకంగా ఎంపిక చేసిన కార్యకర్తలకు ఆత్మీయ గౌరవ సత్కారం నిర్వహించినట్లు తెలిపారు. విజయనగరం జిల్లాలోని పర్యాటక ప్రాంతమైన సన్‌రే రిసార్ట్‌లో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆమె వెల్లడించారు. కార్యక్రమానికి హాజరయ్యే కార్యకర్తల కోసం ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసి, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. తెలుగుదేశం పార్టీ అంటే ఒక్కరి పార్టీ కాదని, ప్రతి కార్యకర్తకు సమానమైన భాగస్వామ్యం ఉన్న కుటుంబమని పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఎప్పటి నుంచో చెబుతున్నారని ఎమ్మెల్యే గౌతు శిరీష చెప్పారు. కార్యకర్తలే దేవుళ్లు అనే అన్న నందమూరి తారక రామారావు ఆశయాన్ని కొనసాగిస్తూ, కార్యకర్తలకు అండగా నిలవాలనే ఆలోచనతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువనేత నారా లోకేష్ కార్యకర్తల పట్ల చూపుతున్న గౌరవం, వారి కష్టాన్ని గుర్తించే విధానం తనకు ఎంతో స్ఫూర్తినిచ్చిందని ఆమె అన్నారు. కార్యకర్తలు నాయకులుగా ఎదగాలని, పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు లభించాలనే ఆలోచనతో తాను ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. కార్యకర్తల కష్టసుఖాల్లో తాను ఎల్లప్పుడూ భాగస్వామిగా ఉంటానని స్పష్టం చేశారు. పార్టీ కోసం ఎండనకా, వాననకా కష్టపడే క్షేత్రస్థాయి కార్యకర్తల వల్లే సంస్థాగతంగా పార్టీ బలోపేతం అవుతుందని ఎమ్మెల్యే అన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే కార్యకర్తలను గుర్తించడం కాకుండా, సాధారణ సమయంలోనూ వారి సంక్షేమం, కుటుంబ పరిస్థితులు, సమస్యలను తెలుసుకుని అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంలోనూ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ కార్యకర్తల పాత్ర కీలకమని తెలిపారు. పలాస నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేస్తున్నారని ఆమె అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పార్టీ శ్రేణులు సమన్వయంతో ముందుకు సాగాలని, ప్రతి గ్రామం, ప్రతి వార్డు స్థాయిలో ప్రజలతో నిరంతరం మమేకమై ఉండాలని సూచించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడమే పార్టీ శ్రేణుల ప్రధాన బాధ్యతగా ఉండాలని చెప్పారు. కార్యకర్తలను గౌరవించడంతో పాటు వారికి కొంత సమయం ఆహ్లాదాన్ని అందించాలనే ఉద్దేశంతో పర్యాటక ప్రాంతంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సత్కార కార్యక్రమంతో పాటు రిసార్ట్‌లోని వివిధ ప్రాంతాలను కార్యకర్తలు సందర్శించి ఆనందంగా గడిపారని చెప్పారు. కార్యక్రమం ద్వారా నాయకులు, కార్యకర్తల మధ్య ఆత్మీయత మరింత పెరిగిందన్నారు. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలు, నాయకుల మధ్య అంతరం లేకపోవడం ప్రత్యేకత అని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరినీ కుటుంబ సభ్యుడిగా భావిస్తామని, వారి సేవలను గుర్తించి తగిన గౌరవం అందించడం కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ప్రత్యేకంగా రూపొందించి నిర్వహించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. పార్టీ శ్రేణులు సంప్రదాయ జానపద కళారూపాలను ప్రదర్శించి కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారని చెప్పారు. కార్యకర్తల సేవలను గుర్తించి వారికి ఆత్మీయ గౌరవం అందించడం ద్వారా పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం పెరుగుతుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. భవిష్యత్తులోనూ కార్యకర్తల సంక్షేమానికి, వారి కుటుంబాలకు అండగా ఉండేందుకు అవసరమైన కార్యక్రమాలను చేపడతామని స్పష్టం చేశారు. ఈ ఆత్మీయ సమావేశంలో పలాస నియోజవర్గ ముఖ్య నాయకులు, బూత్ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాకుళాన్ని తక్షణమే కరువు జిల్లాగా ప్రకటించాలి

**- కరువు నిబంధనలను పాటించాలి**

**-పంట నష్టపరిహారం, రుణ ఉపశమనం ఇవ్వాలి**

**- గిరిజన శక్తి సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు సవర రేవతి డిమాండ్**



**మందస, అక్టోబరు 7(వార్త):** జిల్లాలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని శ్రీకాకుళాన్ని తక్షణమే కరువు ప్రభావిత జిల్లాగా ప్రకటించాలని గిరిజన శక్తి సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు సవర రేవతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మందసలో రేవతి బుధవారం మాట్లాడుతూ ఖరీఫ్ ప్రారంభం నుంచి ఆశించిన స్థాయిలో వర్షాలు లేక విత్తనాలు, నారుమళ్లు దెబ్బతినడంతో పాటు సాగు చేసిన పంటలు సైతం ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాభావం కారణంగా రైతులు పెట్టిన పెట్టుబడులు నష్టపోతున్నారని, చెరువులు, కాలువలు, ఇతర నీటి వనరుల్లో నీటి నిల్వలు తగ్గిపోవడంతో సాగు, తాగునీటి సమస్యలు తీవ్రమవుతున్నాయని తెలిపారు. గత మూడు నెలల వర్షపాతం, సాగు విస్తీర్ణం, పంటల పరిస్థితి, నీటి వనరులపై మండలాల వారీగా తక్షణ క్షేత్రస్థాయి సర్వే నిర్వహించాలని కోరారు. సర్వే ఆధారంగా కరువు ప్రభావిత మండలాలను గుర్తించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం అత్యవసర సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వర్షాభావంతో నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ, రుణ ఉపశమనం అందించాలని కోరారు. అలాగే పంటలకు సాగునీరు, ప్రజలకు అందించేందుకు ప్రత్యేక అత్యవసర చర్యలు చేపట్టాలని సూచించారు. సెప్టెంబరు చివర్లో కొన్ని ప్రాంతాల్లో కురిసిన వర్షాలను చూపి జిల్లాలో పరిస్థితి సాధారణంగా ఉందని భావించడం సరికాదని సవర రేవతి స్పష్టం చేశారు. రైతుల వాస్తవ పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, శ్రీకాకుళాన్ని వెంటనే కరువు జిల్లాగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. ఆమెతో పాటు కార్యదర్శి సవర హరికృష్ణ కూడా ఉన్నారు.

## సైకిల్‌పై శక్తిపీఠాల బాటలో..

**- పలాస చేరిన మంచిర్యాల యువకుడు**



**పలాస, అక్టోబరు 7 (వార్త):** దేశంలోని 17 శక్తిపీఠాలను దర్శించాలనే ఆధ్యాత్మిక సంకల్పంతో తెలంగాణ రాష్ట్రం మంచిర్యాల ప్రాంతానికి చెందిన సందేశ్ గుప్తా సైకిల్‌పై చేపట్టిన పుణ్యక్షేత్రాల యాత్ర బుధవారం పలాసకు చేరుకుంది. మంచిర్యాల నుంచి సైకిల్‌పై సుదూర ప్రాంతాలను దాటుకుంటూ కొనసాగుతున్న ఆయన పలాసలోని ప్రముఖ ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల విశిష్టత, ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని తెలుసుకున్నారు. శక్తిపీఠాల దర్శనంతో పాటు మార్గమధ్యంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను సందర్శిస్తూ యాత్ర కొనసాగిస్తున్నట్లు సందేశ్ గుప్తా తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలోని అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయం, శ్రీకూర్మం శ్రీ కూర్మనాథస్వామి ఆలయాలను దర్శించడం ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. ఆధ్యాత్మికత, భక్తి భావంతో సైకిల్‌పై సుదీర్ఘ యాత్ర చేయడం ద్వారా పలు పుణ్యక్షేత్రాలను దర్శించుకోవాలన్నదే తన ప్రధాన సంకల్పమని తెలిపారు. సందేశ్ గుప్తా చేపట్టిన ఆధ్యాత్మిక యాత్రకు విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు పలాసలో ఘన స్వాగతం పలికారు. ధాత్త ఆశ్రమ స్వామీజీ ఆధ్వర్యంలో ఆయనకు ఆశ్రయం కల్పించి అభినందించారు. సైకిల్‌పై సుదీర్ఘ ఆధ్యాత్మిక యాత్ర చేపట్టి పుణ్యక్షేత్రాలను సందర్శిస్తున్న సందేశ్ గుప్తాను పలువురు అభినందించారు.

## మద్యం దుకాణానికి అనుమతి ఇవ్వొద్దు

**- మూడు గ్రామాల ప్రజల వినతి**

**పలాస, అక్టోబరు 7 (వార్త):** పలాస మండలం గురుదాసుపురం పంచాయతీ పరిధిలోని చిన్న గురుదాసుపురం జంక్షన్ వద్ద మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని చిన్న గురుదాసుపురం, కొబ్బరి చెట్లూరు, చిన్నమామిడిమెట్టు గ్రామాల ప్రజలు, యువకులు, మహిళలు కోరారు. తమ గ్రామాలను మద్యరహిత గ్రామాలుగా కొనసాగించాలని గ్రామసభల్లో నిర్ణయించినట్లు తెలిపారు. ఈ మేరకు మూడు గ్రామాల ప్రజల తరఫున బుధవారం కాశీబుగ్గ ఎక్సైజ్ సీఐ మల్లికార్జునరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల పరిధిలో ఎలాంటి మద్యం దుకాణాలకు అనుమతి ఇవ్వవద్దని కోరారు. ఇప్పటికే కొనసాగుతున్న అక్రమ మద్యం విక్రయ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ అనుమతులతో ఏర్పాటు చేయనున్న మద్యం దుకాణాలను సైతం తమ గ్రామాల పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. చిన్న గురుదాసుపురం గ్రామానికి సుమారు కిలోమీటరు దూరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉందని తెలిపారు. పరిసర ప్రాంతాల్లోని ఎనిమిది గ్రామాల నుంచి విద్యార్థులు ప్రతిరోజూ ఇదే ప్రధాన రహదారి మీదుగా పాఠశాలకు రాకపోకలు సాగిస్తున్నారని చెప్పారు. పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు నడుచుకుంటూ, సైకిళ్లపై పాఠశాలకు వెళ్తుంటారని వివరించారు. ప్రధాన రహదారి సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే మద్యం సేవించిన వ్యక్తుల వల్ల విద్యార్థులు, మహిళలు, గ్రామస్థులకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాల ప్రశాంత వాతావరణాన్ని కాపాడటంతోపాటు విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు. తమ గ్రామాల పరిసర ప్రాంతాల్లో మద్యం దుకాణాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చిన్న గురుదాసుపురం గ్రామ కమిటీ అధ్యక్షుడు కే. తేజేశ్వరరావు, కార్యదర్శి జి. దేవదాస్, కొబ్బరి చెట్లూరుకు చెందిన పాతిని జానకిరావు, జినగ శ్రీధర్, డొక్కరి మాధవరావు, జె. వినోద్, జె. సుధీర్, ఎం. వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## వరి తెగుళ్ల నివారణకు జిల్లేడు ద్రావణం



**నరసన్నపేట, అక్టోబరు 7 (వార్త):** ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో వరి పంటను ఆశించే వివిధ తెగుళ్లు, రసం పీల్చే పురుగులను జిల్లేడు ద్రావణంతో సమర్థంగా నియంత్రించవచ్చని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ తోట రమణ తెలిపారు. నరసన్నపేట మండలం దేవాది గ్రామంలో బుధవారం రైతులకు జిల్లేడు ద్రావణం తయారీ, వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 400 లీటర్ల జిల్లేడు ద్రావణం తయారీ విధానాన్ని రైతులకు ప్రత్యక్షంగా వివరించారు. వరి పంటలో తెగుళ్ల ఉధృతి కనిపించినప్పుడు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో అందుబాటులో ఉండే ద్రావణాలను వినియోగించడం ద్వారా పంటను రక్షించుకోవచ్చని సూచించారు. జిల్లేడు ద్రావణం పంటను ఆశించే తెగుళ్లతో పాటు రసం పీల్చే పురుగుల నియంత్రణకు ఉపయోగపడుతుందని తోట రమణ వివరించారు. వరి పంటలో ఏర్పడే పొటాషియం లోటును తగ్గించడంలో కూడా ఈ ద్రావణం ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకుని, పంటల సాగులో అందుబాటులో ఉన్న సహజ వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో స్థానిక రైతులు పాల్గొని జిల్లేడు ద్రావణం తయారీ, దాని ఉపయోగాలపై వివరాలను తెలుసుకున్నారు.

## ఎన్నికల దృష్ట్యా ప్రజలు సమన్వయంతో మెలగాలి



**మందస, అక్టోబరు 7(వార్త):** స్థానిక ఎన్నికలు దృష్ట్యా ప్రజలు సమన్వయంతో మెలగాలని కాశీబుగ్గ డీఎస్పీ టి.భవాని పిలుపునిచ్చారు. మందస మండలంలోని పొత్తంగిలో పల్లెనిద్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ భవాని మాట్లాడుతూ శాంతి, భద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు. పల్లెలు ప్రశాంతానికి నిలయం కావాలని, శాంతి, భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని డీఎస్పీ భవాని మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రశాంత వాతావరణం ఉండేలా సహకరించాలని కోరారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడవద్దని హితవు పలికారు. పోలీసులు ప్రజలకు మిత్రులను, వారి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలీసులు ప్రజలకు చేరువగా ఉంటారని, సమస్యలను తెలియజేయాలన్నారు. శాంతిభద్రతలను పటిష్ఠం చేసేందుకు పోలీసులకు సహకరించాలన్నారు. రానున్న ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. అనంతరం సమస్యలు, భద్రతా అంశాలపై ప్రజల అభిప్రాయాలను సేకరించారు. సైబర్ నేరాలు, వివిధ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాశీబుగ్గరూరల్ సీఐ ఎం.తిరుపతిరావు, మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదిత్య జూనియర్ కాలేజీ విద్యార్థులకు కంటి పరీక్షలు

**మందస, అక్టోబరు 7(వార్త):** మందస మండలంలోని బాలిగాం సమీపంలో ఉన్న ఆదిత్య విద్యాసంస్థలలోని జూనియర్ కళాశాల విద్యార్థులకు మందస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నేత్ర వైద్య సహాయాధికారి రోణంకి వెంకటరమణ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంఘం, చైర్మన్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాలు ప్రకారం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ ప్రిన్సిపల్ బొంగి ప్రవీణ్ చెప్పారు. మొత్తం 208మంది విద్యార్థులకు రోణంకి వెంకటరమణ కంటి పరీక్షలు నిర్వహించగా.. 22మంది విద్యార్థులకు దృష్టిలోపం సమస్య ఉన్నట్టు గుర్తించారు. వీరికి కళ్ల అద్దాలను వినియోగించాల్సిందిగా ఆయన తెలిపారు. అనంతరం నేత్ర వైద్య సహాయాధికారి వెంకటరమణ, ప్రిన్సిపల్ ప్రవీణ్ మాట్లాడుతూ కంటి సమస్యలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కంటి వ్యాధులు, నేత్ర సంరక్షణపై పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. మొబైల్ ఫోన్‌ను అతిగా వినియోగించవద్దని, దీంతో కంటికి కలిగే సమస్యలను వివరించారు. కార్యక్రమం, కళాశాల ప్రిన్సిపాల్ బొంగి ప్రవీణ్, బీజేఎస్‌కే ప్రసాద్, ఆశా వర్కర్ కృష్ణవేణి, కాలేజీ లెక్చరర్లు మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.




## కేంద్ర ఎన్నికల ప్రక్రియపై కాంగ్రెస్ నేతల విమర్శలు

**- ఎన్నికల ప్రక్రియలో లోపాలున్నాయంటూ మామిడి సత్యనారాయణ ఆరోపణ**

**- తొలగించిన ఓట్లను తిరిగి జాబితాలో చేర్చాలని డిమాండ్**

**- బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని కోరిన కాంగ్రెస్ నేతలు**



**జలుమూరు, అక్టోబరు 7(వార్త):** కేంద్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అనేక లోపాలు ఉన్నాయని నరసన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మామిడి సత్యనారాయణ ఆరోపించారు. బుధవారం చల్లవానిపేట జంక్షన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన పలు అంశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని, ఎన్నికల యంత్రాంగాన్ని విమర్శించారు. దేశవ్యాప్తంగా సుమారు 13 కోట్లకు పైగా ఓట్లు తొలగించారని ఆయన పేర్కొన్నారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు నష్టం కలిగించే అంశమని అన్నారు. తొలగించిన ఓట్లను సమగ్రంగా పరిశీలించి అర్హులైన ఓటర్ల పేర్లను తిరిగి ఓటర్ల జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఎన్నికల నిర్వహణపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేందుకు నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఉందని సత్యనారాయణ అన్నారు. సెంట్రల్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని, ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు మరింత నమ్మకం కలిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో జలుమూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుంట కరణవీరుడు తదితరులు పాల్గొన్నారు. అయానా మట్లదుతు భవిష్యత్‌లో ఎన్నికలను బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సాగినప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని పేర్కొన్నారు. ప్రజల ఓటు హక్కును పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు.

## సవరమాలువలో ఇంటింటికీ తాగునీటి సౌకర్యం

**- కొళాయి పనులు పూర్తి చేసి నీటి సరఫరా ప్రారంభం**

**- గ్రామస్థుల చిరకాల వాంఛ నెరవేరిందని నాయకుల వెల్లడి**

**- కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు, గ్రామస్థులు**



**సారవకోట, అక్టోబరు 7 (వార్త):** మాలువ గ్రామ పంచాయతీ పరిధిలోని సవరమాలువ గ్రామంలో ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన కొలాయి పనులు పూర్తయ్యాయి. గ్రామస్థుల చిరకాల సమస్యకు పరిష్కారం లభించడంతో ఇంటింటికీ తాగునీటి సరఫరాను ప్రారంభించారు. నరసన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆదేశాల మేరకు సారవకోట మండల తెలుగుదేశం పార్టీ నాయకులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ బీసీ కమిటీ అధికార ప్రతినిధి, సారవకోట మండల టీడీపీ నాయకుడు ధర్మాన తేజ్‌కుమార్ నాయకత్వంలో గ్రామంలో ప్రతి ఇంటికీ కొలాయి ఏర్పాటు చేసే పనులను పూర్తి చేశారు. అనంతరం ఆయన తాగునీటి సరఫరాను ప్రారంభించారు. మాలువ గ్రామ పంచాయతీ టీడీపీ సీనియర్ నాయకుడు మామిడి మోహన్‌రావు, యువనాయకుడు సిరిపురం అప్పలనాయుడు ఆధ్వర్యంలో పనులు కొనసాగినట్లు నాయకులు తెలిపారు. ఇంటింటికీ తాగునీరు అందుబాటులోకి రావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ఈ సౌకర్యం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాలువ గ్రామ పంచాయతీ టీడీపీ అధ్యక్షుడు మామిడి ఆనందరావు, సారవకోట ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ సురవరపు తిరుపతిరావు, సారవకోట మండల టీడీపీ యువనాయకుడు దువ్వారి జయరాం, యూనిట్ ఇన్‌ఛార్జి ఇసై నాగరాజు, సారవకోట మండల తెలుగు యువత అధ్యక్షుడు పిళ్లా నందకిషోర్‌తో పాటు సవరమాలువ గ్రామస్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రి, ఎంఎల్ఏ పర్యటన విజయవంతం చేయాలి



**మందస, అక్టోబరు 7(వార్త):** శ్రీకాకుళం పార్లమెంట్ సభ్యుడు, కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్నాయుడు, పలాస ఎంఎల్ఏ గౌతు శిరీషా పర్యటన విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన కోరారు. మందస మండలంలోని హరిపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 8న కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్నాయుడు, పలాస ఎంఎల్ఏ గౌతు శిరీషా మందస మండలంలోని హరిపురంలో పర్యటించనున్నారన్నారు. గురువారం కింజరాపు రాంమోహన్ నాయుడు, పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీషలు మధ్యాహ్నం 12గంటలకు హరిపురం గ్రామంలో సెంటర్ డివైడర్ కు శంకుస్థాపన చేస్తారన్నారు. మధ్యాహ్నం 12.30గంటలకు హరిపురం గ్రామంలో ఇండోర్ స్టేడియంకు శంకుస్థాపన చేయనున్నారన్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కుటుంబ సభ్యులు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, పాత్రికేయ సోదరులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

# సాయినగర్‌లో చోరీ

- ఇంట్లో ఎవరూ లేని సమయంలో చోరీ జరిగినట్లు అనుమానం
- క్లూస్ టీమ్‌తో ఆధారాల సేకరణకు పోలీసుల చర్యలు
- అదే ప్రాంతంలో ద్విచక్ర వాహనం చోరీపై సమాచారం

**నరసన్నపేట, అక్టోబరు 7 (వార్త):** నరసన్నపేటలోని సాయినగర్‌లో బుధవారం తెల్లవారుజామున చోరీ జరిగినట్లు స్థానికులు గుర్తించారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు ప్రవేశించి చోరీకి పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. సాయినగర్‌కు చెందిన ఎస్. లక్ష్మణరావు కుటుంబ సభ్యులు ఇటీవల హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లడంతో ఇల్లు ఖాళీగా ఉంది. ఈ సమయంలో చోరీ జరిగినట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు.

అయితే చోరీకి గురైన వస్తువులు, వాటి విలువకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. శ్రీకాకుళం నుంచి క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలను సేకరించే చర్యలు చేపట్టారు. పోలీస్ శాఖలో ఏఎస్ఐగా పనిచేసిన ఎస్. అప్పారావు ఇంట్లోనే ఈ ఘటన జరిగినట్లు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ఇదే ప్రాంతంలో ఓ ద్విచక్ర వాహనం కూడా చోరీకి గురైనట్లు స్థానికుల నుంచి సమాచారం అందింది. ఈ ఘటనకు సంబంధించి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. చోరీకి పాల్పడిన వ్యక్తులను గుర్తించేందుకు పరిసర ప్రాంతాల్లోని వివరాలను సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు.





## రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు దీర్ఘాసి విద్యార్థులు

- జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన ఐదుగురు
- కాకినాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక
- విద్యార్థులను అభినందించిన ఉపాధ్యాయులు, స్థానికులు

**పోలాకి, అక్టోబరు 7 (వార్త):** పోలాకి మండలం దీర్ఘాసి జడ్పీ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారని ఎంఈవో ఎస్. శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విద్యార్థుల ఎంపిక వివరాలను వెల్లడించారు. ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో దీర్ఘాసి జడ్పీ పాఠశాలకు చెందిన జి. పూజిత, పి. మౌనిక, హిమబిందు, పి. పూజిత, ప్రశాంత్ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాల్లో నిలిచినట్లు ఎంఈవో తెలిపారు. దీంతో వీరికి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం లభించిందన్నారు. రాష్ట్రస్థాయి పోటీలు కాకినాడలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలోనూ మెరుగైన ప్రదర్శన కనబరిచి పాఠశాలకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఎంఈవో ఆకాంక్షించారు. విద్యార్థుల ఎంపిక పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్థానికులు హర్షం వ్యక్తం చేసి వారిని అభినందించారు.

## ఏరియా ఆస్పత్రిలో సిబ్బంది సమ్మె

- సుమారు 26 మంది నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది సమ్మెలో
- వైద్య సేవలకు కొంత మేర ఇబ్బందులు
- 65 మంది నర్సింగ్ శిక్షణార్థినులతో రెండు షిఫ్టుల్లో సేవలు

**నరసన్నపేట, అక్టోబరు 7 (వార్త):** నరసన్నపేట ఏరియా ఆస్పత్రిలో నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది సమ్మెలోకి వెళ్లడంతో వైద్య సేవల నిర్వహణపై ప్రభావం పడింది. ఆస్పత్రిలో పనిచేస్తున్న సుమారు 26 మంది సిబ్బంది సమ్మెలో ఉన్నట్లు సమాచారం. సిబ్బంది సమ్మె కారణంగా ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్య సేవలు అందించడంలో కొంత ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయి. ముఖ్యంగా నర్సింగ్, పారామెడికల్ సేవల నిర్వహణలో అదనపు సిబ్బంది అవసరం ఏర్పడినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో స్థానికంగా నర్సింగ్ శిక్షణ పొందుతున్న 65 మంది విద్యార్థినులు ఆస్పత్రిలో సేవలు అందిస్తున్నారు. వీరిని రెండు షిఫ్టులుగా విభజించి విధుల్లో కొనసాగిస్తున్నట్లు ఆఫీస్ సూపరింటెండెంట్ చరణ్ తెలిపారు. రోగులకు అవసరమైన సేవలు అందేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో విధులను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమ్మె నేపథ్యంలో ఆస్పత్రిలో వైద్య సేవలకు అంతరాయం కలగకుండా అధికారులు తీసుకుంటున్న చర్యలపై రోగులు, వారి సహాయకులు దృష్టి సారించారు.





## గ్రానైట్ క్వారీ పేలుళ్లతో
# గ్రామస్థుల్లో ఆందోళన

- పేలుళ్ల ధాటికి ఇళ్లు, పాఠశాలకు బీటలు
- రాళ్లు ఎగిరిపడే ప్రమాదంతో విద్యార్థులు, ప్రజల్లో భయాందోళన
- భారీ వాహనాలతో దెబ్బతింటున్న రహదారి.. భద్రతా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి

**సారవకోట, అక్టోబరు 7 (వార్త):** గోవర్ధనపురం పంచాయతీ పరిధిలోని పెద్దగుజ్జువాడలో కొనసాగుతున్న గ్రానైట్ క్వారీ కార్యకలాపాలతో గ్రామస్థులు, విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. క్వారీలో తరచూ నిర్వహిస్తున్న పేలుళ్ల కారణంగా పరిసర ప్రాంతాల్లోని ఇళ్లు, పాఠశాల భవనాల గోడలకు బీటలు పడుతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. క్వారీలో పేలుళ్ల సమయంలో రాళ్లు ఎగిరి జనావాసాల వైపు పడే అవకాశం ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయపడుతున్నారు. ముఖ్యంగా పాఠశాల సమీపంలో క్వారీ కార్యకలాపాలు కొనసాగుతుండటంతో విద్యార్థుల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పేలుళ్ల ప్రభావంతో భవనాలకు నష్టం వాటిల్లే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. అదేవిధంగా క్వారీకి భారీ వాహనాలు నిరంతరం రాకపోకలు సాగిస్తుండటంతో గ్రామ రహదారులు దెబ్బతింటున్నాయని తెలిపారు. వాహనాల రాకపోకల కారణంగా ప్రజలకు అసౌకర్యంతో పాటు ప్రమాదాల భయం నెలకొంటోందని గ్రామస్థులు పేర్కొన్నారు. క్వారీ కార్యకలాపాలు, పేలుళ్ల నిర్వహణ, భారీ వాహనాల రాకపోకలపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని గ్రామస్థులు కోరారు. ప్రజలు, విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని, ఇళ్లు, పాఠశాలలకు నష్టం కలగకుండా క్వారీ నిర్వాహకులు నిబంధనలు పాటించేలా చూడాలని బుధవారం విజ్ఞప్తి చేశారు.

# స్వచ్ఛ రథాన్ని వినియోగించుకోవాలి

- తడి, పొడి చెత్తను వేరు చేసి అందించాలి
- ప్లాస్టిక్, పాలిథిన్ కవర్ల వినియోగాన్ని తగ్గించాలి
- పట్టణ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఈవో విజ్ఞప్తి



**నరసన్నపేట, అక్టోబరు 7 (వార్త):** నరసన్నపేట మేజర్ పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరచేందుకు ప్రజలందరూ స్వచ్ఛ రథాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈవో పిల్లా జగన్‌మోహన్‌రావు కోరారు. ఇంట్లో ఉత్పత్తయ్యే చెత్తను రోడ్లపై, ఖాళీ ప్రదేశాల్లో పడవేయకుండా పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలని సూచించారు. ప్రజలు తమ ఇళ్లలోని చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి గ్రీన్ అంబాసిడర్లకు అందించాలని ఈవో తెలిపారు. చెత్తను ముందుగానే వేరు చేయడం ద్వారా వ్యర్థాల నిర్వహణ సులభతరం కావడంతో పాటు పునర్వినియోగానికి ఉపయోగపడే పదార్థాలను వేరు చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పట్టణంలో ప్లాస్టిక్, పాలిథిన్ కవర్ల వినియోగాన్ని వీలైనంత వరకు తగ్గించాలని ఆయన సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి ప్లాస్టిక్‌కు బదులుగా పునర్వినియోగ వస్తువులను వినియోగించాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడుకోవచ్చని, పారిశుద్ధ్య కార్యక్రమాలకు ప్రజల సహకారం ఎంతో అవసరమని ఈవో పేర్కొన్నారు. నరసన్నపేటను పరిశుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు పంచాయతీ చేపడుతున్న చర్యలకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# అగ్ని ప్రమాదంతో పేదవాడి జీవితం చీకటిమయం

- సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం..
- రూ.1.20 లక్షలు అగ్నికి ఆహుతి







**సంతబొమ్మాళి, అక్టోబరు 7(వార్త):** షార్ట్ సర్క్యూట్ ఓ వికలాంగుడి బతుకుబండిని బూడిద చేసింది. నౌపడ గ్రామానికి చెందిన వికలాంగుడు కర్రి నాగరాజు జీవనాధారమైన బడ్డీ బుధవారం షార్ట్ సర్క్యూట్ తో అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదంలో బడ్డీలోని సామగ్రితో పాటు ఎంతో కష్టపడి దాచుకున్న సుమారు రూ. 1.20 లక్షల నగదు పూర్తిగా కాలిపోవడంతో మొత్తం సుమారు రూ. 2 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించింది. ఒంటరిగా జీవిస్తున్న నాగరాజు వికలాంగ పింఛన్‌పై ఆధారపడి జీవనం సాగిస్తున్నాడు. ప్రభుత్వం అందిస్తున్న నెలకు రూ. 6 వేల పింఛన్‌లో తన అవసరాలకు కొంత మొత్తాన్ని వినియోగించుకుని, మిగిలిన మొత్తాన్ని భవిష్యత్ అవసరాల కోసం పొదుపు చేసుకుంటూ వచ్చాడు. అలా ఎంతోకాలంగా దాచుకున్న సుమారు రూ. 1.20 లక్షల నగదు ప్రమాదంలో కాలిపోవడంతో ఆయనకు తీవ్ర నష్టం వాటిల్లింది. బడ్డీలో ఉన్న ఇతర సామగ్రి కూడా పూర్తిగా దగ్ధమైంది. కళ్లముందే జీవనాధారమైన బడ్డీ, పొదుపు చేసిన నగదు అగ్నికి ఆహుతవడంతో నాగరాజు కన్నీరుమున్నీరయ్యాడు. తనకు ఉన్న ఏకైక ఆధారం కూడా కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశాడు.

ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించి తన పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని ఆర్థికసాయం అందించాలని వేడుకున్నాడు.

ప్రమాదం విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి ఉమాపతి, వీఆర్వో జోగారావు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. నష్టం వివరాలను సేకరించారు.

## శ్రీకాకుళం

### డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జరిమానా

- మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరిపై కేసు నమోదు
- న్యాయస్థానంలో హాజరుపరిచిన పోలీసులు
- ఇరువురికీ చెరో రూ.10 వేల జరిమానా విధింపు

**నరసన్నపేట, అక్టోబరు 7 (వార్త):** మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఇద్దరిపై కేసులు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు నరసన్నపేట ఎస్సై బి.గణేష్ తెలిపారు. మంగళవారం సాయంత్రం నరసన్నపేట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. మండలంలోని దశమంతపురానికి చెందిన జుట్టు రామన్న, పోలాకి గ్రామానికి చెందిన మోతుబరి కృష్ణ మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారని ఎస్సై తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో భాగంగా వారిని గుర్తించి, నిబంధనల మేరకు కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం ఇరువురినీ న్యాయస్థానంలో హాజరుపరచగా, ఒక్కొక్కరికి రూ. 10,000 చొప్పున జరిమానా విధిస్తూ జడ్జి వాణి తీర్పు ఇచ్చినట్లు ఎస్సై బి.గణేష్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున వాహనదారులు నిబంధనలు పాటించాలని పోలీసులు సూచించారు.

### వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన




**పోలాకి, అక్టోబరు 7 (వార్త):** వన్యప్రాణుల సంరక్షణ, అడవుల పరిరక్షణపై విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని టెక్కలి అటవీ శాఖ రేంజర్ జగదీశ్ అన్నారు. పోలాకి మండలం జిల్లేడువలస జడ్పీ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రేంజర్ జగదీశ్ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో అడవులు, వన్యప్రాణులు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. అడవులను పరిరక్షించడం ద్వారా వన్యప్రాణులకు సహజ ఆవాసాలను కాపాడినట్లవుతుందని, ప్రకృతి వనరుల సంరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అడవులను అక్రమంగా నరికివేయడం, వన్యప్రాణులను వేటాడటం వంటి చర్యలు చట్టరీత్యా నేరమని విద్యార్థులకు వివరించారు. వన్యప్రాణులకు హాని కలిగించే చర్యలకు దూరంగా ఉండడంతోపాటు, వాటి సంరక్షణపై ప్రజల్లో కూడా అవగాహన కల్పించాలని కోరారు. పాఠశాల స్థాయి నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందితే భవిష్యత్‌లో ప్రకృతి సంరక్షణకు మరింత తోడ్పాటు అందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ శ్రీనివాస్, అటవీ శాఖ సిబ్బంది పాల్గొని విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణ, అడవుల ప్రాధాన్యతపై పలు అంశాలను వివరించారు.

### సౌర విద్యుత్‌పై అవగాహనకు సేవా సేతు




**పలాస, అక్టోబరు 7 (వార్త):** సేవా సేతు కార్యక్రమంలో భాగంగా అక్టోబరు 9వ తేదీ శుక్రవారం పలాస జూనియర్ కళాశాల ఆవరణలో గృహ సౌర విద్యుత్ పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు శ్రీకాకుళం జిల్లా విద్యుత్ శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ గుల్ల యజ్ఞేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా గృహాలపై సౌర విద్యుత్ పలకలు ఏర్పాటు చేసుకోవాలనుకునే విద్యుత్ వినియోగదారులకు పథకంపై సమగ్ర అవగాహన కల్పించడంతోపాటు దరఖాస్తుల స్వీకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. సౌర విద్యుత్ వ్యవస్థ ఏర్పాటుకు అవసరమైన రుణ సదుపాయంపై బ్యాంకు అధికారుల ద్వారా వివరాలు అందించడంతోపాటు, అర్హతలు, దరఖాస్తు విధానం, రాయితీలు తదితర అంశాలపై సందేహాలను నివృత్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది, బ్యాంకు అధికారులు, సౌర విద్యుత్ పరికరాల విక్రయదారులు పాల్గొని వినియోగదారులకు అవసరమైన సమాచారాన్ని అందించనున్నట్లు వెల్లడించారు. సౌర విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలనే ఆసక్తి ఉన్న విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని కార్యక్రమానికి హాజరై తమ సందేహాలను నివృత్తి చేసుకోవడంతోపాటు, అవసరమైన దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కార్యనిర్వాహక ఇంజినీర్ శ్గల్ల యజ్ఞేశ్వరరావు సూచించారు.

### అగ్నిప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

**సంతబొమ్మాళి, అక్టోబరు 7 (వార్త):** షార్ట్ సర్క్యూట్ ప్రమాదంలో సర్వం కోల్పోయిన నౌపడ గ్రామానికి చెందిన వికలాంగుడు కర్రి నాగరాజును ఆదుకునేందుకు టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు సుగ్గు శాంతి స్వరూప్ రెడ్డి తక్షణమే స్పందించారు. విషయం తెలుసుకున్న వెంటనే బుధవారం బాధితుడి వద్దకు వెళ్లి రూ. 5 వేల ఆర్థిక సాయం అందజేశారు. అగ్నిప్రమాదంలో నగదు, బడ్డీలోని సామగ్రి పూర్తిగా కాలిపోయి తీవ్రంగా నష్టపోయిన నాగరాజు పరిస్థితిని తెలుసుకున్న శాంతి స్వరూప్ రెడ్డి, ప్రస్తుత అవసరాల కోసం ఈ నగదును రేషన్, దుస్తులు కొనుగోలు చేసేందుకు వినియోగించుకోవాలని సూచించారు. బాధితుడికి ప్రభుత్వం నుంచి అవసరమైన సాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. త్వరలోనే రెవెన్యూ అధికారులు బియ్యం అందజేస్తారని చెప్పారు. ఇదిలా ఉండగా, అగ్నిప్రమాదంతో నివాసం ఉండేందుకు కూడా ఇబ్బందులు పడుతున్న నాగరాజుకు రేకుల షెడ్ నిర్మించి ఇవ్వాలని గ్రామస్తులు కోరారు. దీనిపై స్పందించిన శాంతి స్వరూప్ రెడ్డి త్వరలోనే రేకుల షెడ్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అగ్నిప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న వెంటనే స్పందించి బాధితుడికి ఆర్థిక సాయం అందించడంతో పాటు, నివాస వసతి కల్పించేందుకు హామీ ఇవ్వడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక చైతన్యం

- పోషణపై అవగాహన కార్యక్రమం
- సమతుల్య ఆహారం, పోషక విలువలపై అవగాహన
- తల్లి, శిశు ఆరోగ్యంలో తొలి 1000 రోజుల ప్రాధాన్యతపై వివరణ
- యుక్తవయస్సు బాలికలకు ఆరోగ్యం, పారిశుధ్యంపై సూచనలు



**జలుమూరు, అక్టోబరు 7 (వార్త):** పోషణ్ అభియాన్‌లో భాగంగా 9వ పోషణ వారోత్సవాల సందర్భంగా జలుమూరు మండలం పంగపేట అంగన్వాడీ కేంద్రంలో ఆరోగ్యం, పోషకాహారంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరోగ్య, మహిళా శిశు సంక్షేమ శాఖల సిబ్బంది సమన్వయంతో నిర్వహించిన కార్యక్రమంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, యుక్తవయస్సు బాలికల ఆరోగ్యం, పోషణకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు. రోజువారీ ఆహారంలో తృణధాన్యాలు, పప్పుధాన్యాలు, పాలు, గుడ్లు, కూరగాయలు, ఆకుకూరలు వంటి పోషక విలువలు కలిగిన పదార్థాలను చేర్చుకోవాలని సిబ్బంది సూచించారు. స్థానికంగా లభించే ఆహార పదార్థాలతో సమతుల్యమైన ఆహారం తీసుకోవడం ద్వారా పోషకాహార లోపాన్ని నివారించవచ్చని వివరించారు. పోషణ వాటికల ద్వారా లభించే ఉత్పత్తులను కూడా ఆహారంలో భాగంగా చేసుకోవాలని తెలిపారు. తల్లి, శిశు ఆరోగ్యంలో శిశువు గర్భంలో పడినప్పటి నుంచి రెండేళ్ల వయస్సు వరకు ఉండే తొలి 1000 రోజులు అత్యంత కీలకమని పేర్కొన్నారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు రక్తహీనత నివారణకు వైద్యుల సూచన మేరకు ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు వినియోగించాలని సూచించారు. ప్రధానమంత్రి మాతృ వందన యోజన ద్వారా లభించే ప్రయోజనాలపై కూడా అవగాహన కల్పించారు. నవజాత శిశువులకు తొలి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే అందించి, అనంతరం తగిన అనుబంధ ఆహారం అందించాలని సూచించారు. చిన్నారుల తొలి దశ అభివృద్ధిలో పోషకాహారంతో పాటు తల్లిదండ్రుల భాగస్వామ్యం కూడా ముఖ్యమని సిబ్బంది వివరించారు. పిల్లలతో మాట్లాడటం, వారితో ఆటలు ఆడించడం, చురుకైన కార్యకలాపాల్లో భాగస్వామ్యం చేయడం ద్వారా వారి మానసిక, విజ్ఞాన వికాసానికి తోడ్పడవచ్చని తెలిపారు. 'మన అంగన్వాడీ--మన బాధ్యత' అనే భావనతో అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారం నాణ్యతపై తల్లిదండ్రులు, పర్యవేక్షణ కమిటీలు దృష్టి పెట్టాలని సూచించారు. యుక్తవయస్సు బాలికలు రక్తహీనతకు గురికాకుండా పోషకాహారం తీసుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత, చేతుల శుభ్రత, పరిసరాల పారిశుధ్యాన్ని పాటించాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ పర్యవేక్షకులు సుజాత, డి. సిథరత్నం, అంగన్వాడీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, జలుమూరు పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రమాద బాధితునికి ఆర్థిక సాయం



**ఇచ్ఛాపురం, అక్టోబరు 7(వార్త):** శ్రీకాకుళం జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నెట్క్యాప్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ అలపాన త్రినాధ రెడ్డి ఆధ్వర్యంలో ప్రమాద బాధితునికి ఆర్థిక సాయం చేశారు. కొజ్జిరియా జంక్షన్ రెడ్డి భవనం సమీపంలోని గ్రామంలో గల పనపాన ఆనంద రెడ్డి హైదరాబాదులో తన కుటుంబ పోషణ కూలి పనుల నిమిత్తం భవన నిర్మాణ కార్మికులుగా వెళ్లి పై అంతస్తు నుంచి పడిపోయిన కారణంగా వెన్నుముక పూర్తిగా దెబ్బతిని భవిష్యత్తులో కూడా లేవలేని విషయమని తన కుటుంబ సభ్యులు తెలియజేశారు. చాలా విషాదం కష్టంలో ఉన్న కుటుంబానికి త్రినాధ రెడ్డి మిత్రులందరికీ తెలియజేసి వారి ద్వారా నగదును సేకరించి వారి కుటుంబానికి రెడ్డి కుల సభ్యులు అందరూ ఇచ్చినటువంటి నగదును .9,400 రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ప్రతినిధి ఆసి తులసయ్య రెడ్డి, గ్రామ పెద్ద పిట్ట దేవేందర్ రెడ్డి, ఇసురు ధర్మారెడ్డి పాల్గొన్నారు.

## ఉత్తమ సేవలకు ఘన సన్మానం



**మందస, అక్టోబరు 7(వార్త):** అంగన్ వాడీ కేంద్రాల్లో ఉత్తమ సేవలు అందించిన కార్యకర్తలు, సహాయకుల సేవలను గుర్తించారు. మందస పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం మందస ప్రోజెక్టు సీడీపీఓ పి.అరుణ వారిని ఘనంగా సన్మానించారు. మందస ప్రాజెక్ట్ ఆఫీసులో పోషణ మసోత్సవాలు, అంగన్ వాడీ ఉత్సవాల చివరి రోజు కార్యక్రమంలో భాగముగా ప్రాజెక్ట్ కార్యాలయంలో సీడీపీఓ అరుణ ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అంగన్ వాడీలకు యూనిఫారంలు అందజేశారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ లు సీహెచ్.వి.రామలక్ష్మి, పి.జయలక్ష్మి, జె.లక్ష్మీ, అంగన్ వాడీ కార్యకర్తలు, సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కోదూరు పంచాయతీలో పల్లె పండుగ 3.0 అభివృద్ధి పనులకు అంచనాలు



**పాతపట్నం, అక్టోబరు 7 (వార్త):** ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆదేశాల మేరకు, స్థానిక కూటమి నాయకుల ప్రత్యేక చొరవతో కోదూరు పంచాయతీలో 'పల్లె పండుగ 3.0' వి.బి.జి. రామ్-జి (వికసిత భారత్ గ్యారెంటీ రోజ్ గార్ అండ్ అడ్వాన్స్‌మెంట్ మిషన్ - గ్రామీణ్) కార్యక్రమం వేగవంతంగా సాగుతోంది. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పాతపట్నం మండలం కోదూరు, సూర్యనారాయణపురం, ప్రహరాజపాలెం గ్రామాల్లో పలు నూతన అభివృద్ధి పనులకు ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ అధికారి సయ్యద్ హజ్మీర్ కూటమి నాయకులతో కలిసి ఆయా గ్రామాల్లో క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్లు, మురుగునీటి కాలువలు, ప్రభుత్వ పాఠశాలల ప్రహరీ గోడలు, చెరువు మెట్లు, స్మశాన వాటిక షెల్టర్లు, గ్రామ సముదాయ భవనాల నిర్మాణానికి సంబంధించి ప్రాథమికంగా కొలతలు వేసి నిధుల అంచనాలు రూపొందించారు. ఎమ్మెల్యే మార్గదర్శకంలో నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నేతలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఇప్పిలి సేవలకు సన్మానం

**సోంపేట, అక్టోబరు 7 (వార్త):** మాజీ జడ్పీటీసీ ఇప్పిలి లోలాక్షి కృష్ణారావు దంపతులకు చొట్రాయిపురం గ్రామంలో బుధవారం ఘనంగా సన్మానం చేశారు. పదవీకాలం విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా వైసీపీ నేత కొర్రాయి శివాజీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంచిలి మండలం లో పార్టీ మరింత పటిష్టం చేయడం, అభివృద్ధి చేపట్టడం, ప్రజలతో సత్సంబంధాలు ద్వారా ఇప్పిలి దంపతులు కృషి ఎనలేనిదని అన్నారు. కర్రి రామయ్య, యాదవయ్య, హేమరాజు, బాలరాజు, మోహనరావు, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.



## పోలీసు సిబ్బంది ఆరోగ్య భద్రతకే ప్రాధాన్యత

* ఆరోగ్య పరిరక్షణకు ఉచిత మెగా వైద్య శిబిరం * జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి



**శ్రీకాకుళం, అక్టోబర్ 7 (వార్త):** పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య భద్రత, పరిరక్షణ, సంక్షేమంలో భాగంగా స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్, కిమ్స్ హాస్పిటల్ సహకారంతో జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై హెల్త్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ హెల్త్ క్యాంప్‌లో సుమారు 200 మంది పోలీసు అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. వారికి ఈసీజీ, 2డీ ఎకో, ఆడియోమెట్రీ, ర్యాండమ్ బ్లడ్ షుగర్, కంటి పరీక్షలు, దంత పరీక్షలు, రక్తపోటు, బ్లడ్ షుగర్ తదితర వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వైద్యసలహాలను వైద్యులు, సిబ్బంది అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. సమాజ భద్రత కోసం నిరంతరం విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది ఆరోగ్యం, సంక్షేమానికి జిల్లా పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిడి, పని భారం నేపథ్యంలో పోలీసు సిబ్బంది తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ముందస్తు ఆరోగ్య పరీక్షల ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి, సకాలంలో వైద్య చికిత్స పొందే అవకాశం ఉంటుందని ఎస్పీ పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు ఇటువంటి ఆరోగ్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. అనుకోని వైద్య పరిస్థితుల్లో కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గించడంలో ఆరోగ్య బీమా కూడా కీలక పాత్ర పోషిస్తుందని, ఆరోగ్య సంరక్షణతో పాటు భవిష్యత్ వైద్య అవసరాలకు ఆర్థికంగా సిద్ధంగా ఉండేలా అవగాహన కల్పించడం ఇటువంటి కార్యక్రమాల ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. పోలీసు సిబ్బంది ఆరోగ్యంగా, మానసికంగా ఉత్సాహంగా ఉంటేనే ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించగలరని, వారి సంక్షేమం కోసం జిల్లా పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుందని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని కిమ్స్ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది సహకారంతో స్టార్ హెల్త్ ప్రతినిధులు ముద్దాడ కృష్ణయ్య, బ్రాంచ్ మేనేజర్ సీహెచ్. బాలకృష్ణ, చీఫ్ సేల్స్ మేనేజర్ బి.యుగంధర్, ఏజెన్సీ డెవలప్‌మెంట్ మేనేజర్ కోటారి వెంకటేష్, హెచ్‌ఆర్ఎం తదితరులు నిర్వహించారు.



## శ్రీకాకుళంను కరువు జిల్లాగా ప్రకటించాలి

- రైతులు, గ్రామీణ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి
- సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు




**పలాస, అక్టోబరు 7 (వార్త):** వర్షాభావ పరిస్థితులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న శ్రీకాకుళం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి, రైతులు, గ్రామీణ కార్మికులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ తామాడ సన్యాసిరావు డిమాండ్ చేశారు. పలాస మండలం బొడ్డపాడు పంచాయతీ సచివాలయం వద్ద గ్రామీణ కార్మిక సంఘం, ఆంధ్రప్రదేశ్ కిసాన్ మహాసభ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. వర్షాభావం కారణంగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఆశించిన స్థాయిలో వరి నాట్లు పూర్తికాలేదని, దీనివల్ల రైతులు, వ్యవసాయ కూలీలు ఉపాధి కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు తగ్గిన నేపథ్యంలో ఉపాధి హామీ పనులను వెంటనే విస్తృతంగా చేపట్టి, పనులు కోరుతున్న ప్రతి కుటుంబానికీ ఉపాధి కల్పించాలని కోరారు. జాబ్ కార్డులు లేని అర్హులైన కుటుంబాలకు వెంటనే జాబ్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వర్షాభావ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని శ్రీకాకుళం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించడంతో పాటు పలాస నియోజకవర్గం నుంచి ఇచ్ఛాపురం నియోజకవర్గం వరకు ప్రభావిత ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. కరువు ప్రభావిత రైతులకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి ఆర్థికంగా ఆదుకోవాలని అన్నారు. పంటలు సాగు చేసేందుకు అనుకూల పరిస్థితులు లేని ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటలకు అవకాశం కల్పించాలని, అందుకు అవసరమైన విత్తనాలు, ఎరువులను ప్రభుత్వం ఉచితంగా లేదా రాయితీపై అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. వర్షాభావంతో పంటలు నష్టపోయిన రైతుల వ్యవసాయ రుణాలను రద్దు చేసి, తదుపరి సాగుకు అవసరమైన కొత్త రుణాలను సకాలంలో మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం బొడ్డపాడు పంచాయతీ సచివాలయ సిబ్బందికి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు మద్దిల రామారావు, ఏఐసీసీటీయూ జిల్లా నాయకులు కుత్తుం దుష్యంత్, పిన్నింటి నాగేశ్వరరావు, రైతు సంఘం నాయకులు పి.అప్పారావు, వి.అప్పయ్య, పాపయ్య, యువజన నాయకులు ఎం.నారాయణ, జి.జగదీష్, ఎం.జగదీష్, ఎన్.యుగంధర్, రాజారావు, ఎం.శ్రీధర్, పి.శ్రీధర్, మహిళా సంఘం నాయకులు కె.ఈశ్వరమ్మ, ఎం.తులసమ్మ, టి.సుందరమ్మ, టి.వరలక్ష్మి, టాంజర్ నీలమ, వరహాలమ్మ, కె.కవిత, మోహినమ్మ, రమణమ్మ, జయసుధ, పి.కళ తదితరులు పాల్గొన్నారు.




Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546